ప్రజాశక్తి
మంగళవారం 2 జులై 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కూల్.. కూల్...



- అంతటా చల్లని గాలులు...
- ఊపిరి పీల్చుకుంటున్న నగర వాసులు
- సాగర తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు...
- ద్రోణి ప్రభావంతో అక్కడక్కడా నేడు, రేపూ వర్షాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సాధారణంగా జూన్ నెల వచ్చిందంటే వర్షాలు ప్రారంభయ్యే పరిస్థితులు గతంలో ఉండేవి. మారుతున్న వాతావరణంతో జులై వరకూ ఈ పరిస్థితి లేదు. అయితే తాజాగా వర్షాలు పడుతుండడంతో జనం అందరిలోనూ వర్షాకాలం వచ్చేసినట్టే అనే భావన కనిపిస్తోంది. సోమవారం నగరంలో పలు చోట్ల మోస్తరు వర్షాలు, అంతటా చల్లని గాలుల ప్రభావం కనిపించింది. విశాఖ సాగర తీరంలో కెరటాలు గాలులకు ఎగసి పడుతున్నాయి.

నైరుతి రుతుపవనాల పశ్చిమ గాలులు రాష్ట్రం అంతటా వీస్తున్నట్లు అమరావతి, విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మొత్తంగా విశాఖ నగరం కూల్ కూల్ కావడంతో ఎండల నుంచి ఒక్కసారిగా ఉపశమనం పొంది చల్లని వాతావరణాన్ని నగర జీవులు అనుభవిస్తున్నారు. విశాఖలో సోమవారం నాటికి 28 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. 1మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు బాగా కురుస్తున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

వర్షపాతంలోనూ మెరుగే...

అల్లూరి జిల్లాలో సాధారణ వర్షపాతం ఈ సీజన్‌లో ఇప్పటివరకూ 169 మి.ఎష కాగా 183.2 మి.మీ వర్షపాతం ఇప్పటికే నమోదైంది. విశాఖ జిల్లాలో ఇప్పటివరకూ 126.3 మి.మీ కురవాల్సి ఉండగా 146.8మి.మీ కురిసింది. అనకాపల్లి జిల్లాలో సాధారణంగా కురవాల్సినది 131.6 మి.మీకు గానూ 207 మి.మీ. కురిసింది. సాధారణం కంటే విశాఖ ఉమ్మడి జిల్లాల్లో వర్షాలు అధికంగానే నమోదు కావడం విశేషం. రాష్ట్రంలో రాయలసీమ 9 జిల్లాల్లోనూ ఈనెల 1 నాటికి అత్యధికంగా అన్ని చోట్లా భారీ వర్షపాతం నమోదైంది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్‌లో 94.1మి.మీ కురవాల్సి ఉండగా 162.1మి.మీ సోమవారం వరకూ నమోదైంది.

అంతటా అప్రమత్తం...

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కారణంగా రాగల 48 గంటల్లో విశాఖ ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు, ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలుస్తోంది. పలు మిగతా 2లో..

సాఫీగా పింఛన్ల పంపిణీ

అనకాపల్లి జిల్లాలో 93 శాతం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పథం కింద 2,64,033 మంది పింఛన్‌దారుల్లో 2,45,740 మందికి (93.09 శాతం) గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పింఛన్ సొమ్ము అందజేశారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటలు దాటే వరకు పింఛన్ సొమ్ము పంపిణీచేశారు. కొత్త ప్రభుత్వం పెంచిన పింఛన్ సొమ్ము ఇంటికి వెళ్లి ఇవ్వడం మొదటిసారి కావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఎస్.రాయవరం మండలం, పెదగుమ్మలూరులో పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అనకాపల్లి పట్టణంలోని మిరియాల కాలనీ సచివాలయం, సబ్బవరం మండలం గొటివాడ సచివాలయంలో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. పింఛన్‌దారులకు విడుదలైన రూ.174.67 కోట్లలో రూ.162.60 కోట్లు అందజేశారు. జిల్లాలో ఎస్.రాయవరం మండలం మినహా మిగిలిన 23 మండలాలు సహా యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాల్టీ, అనకాపల్లి పట్టణంలో 90 శాతానికి పైగా పింఛన్ సొమ్ము పంపిణీచేశారు. అత్యధికంగా కె.కోటపాడు మండలంలో 11,002 మంది లబ్ధిదారులకు విడుదలైన రూ.7.10 కోట్లలో రూ.6.91 కోట్లు (97.38 శాతం) అందించారు. ఎస్.రాయవరం మండలంలో 87.27 శాతం పంపిణీ జరిగింది. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి, డిఎల్‌డిఒ మంజులవాణి, పెన్షన్ డిపిఎం వెంకటరమణ, ఎపిడి డైజి పింఛన్ సొమ్ము పంపిణీ పర్యవేక్షించారు. మంగళవారం మిగిలిన వారికి అందించి పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమం పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.



పింఛన్ పంపిణీని పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి

విశాఖ ఉక్కుపై సిఎం, డిప్యూటీ సిఎం స్పందించాలి

వార్త 2లో..

రక్తికట్టించిన 'లవకుశ'

వార్త 2లో..

ఆర్‌టిసిలో సంస్కరణలు : మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వార్త మెయిన్ 3లో..

చిన్నారిపై లైంగిక దాడి

వార్త మెయిన్ 3లో..

నగర పోలీసు కమిషనర్‌గా శంఖబ్రాత బాగ్చి బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ సిటీ నూతన పోలీస్ కమిషనర్‌గా డాక్టర్ శంఖబ్రాత బాగ్చి సోమవారం ఉదయం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, జాతీయ వైద్యుల దినోత్సవం రోజు బాధ్యతలు చేపట్టడం ఒక వైద్యునిగా చాలా సంతోషంగా ఉందన్నారు. విశాఖతో చాలా ఏళ్ళ నుంచి తనకు మంచి అనుబంధం ఉందని, విధుల రీత్యా పలు మార్లు విశాఖ వచ్చినట్లు తెలిపారు. విశాఖ మహా నగరంలో ఉన్న సమస్యలపై అవగాహన ఉందన్నారు. డ్రగ్స్ అండ్ నార్కోటిక్స్ ప్రథమ సమస్య అని, వాటిని రూపుమాపడం తన మొదటి ప్రాధాన్యత అని చెప్పారు. ఎవరైనా పోలీస్ స్టేషన్‌కు వస్తే మర్యాదగా వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోలీసు సిబ్బందికి సంక్షేమం అందేటట్లు చూస్తానని తెలిపారు. నగర ప్రజలకు ఏదైనా ఇబ్బంది, ఏదైనా సమస్య ఉన్నా, సమాచారం ఇవ్వాలన్నా, ఏదైనా అన్యాయం జరిగినా 7995095799 నెంబరును సంప్రదించాలని చెప్పారు.

భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలి

విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం, మోటార్ వర్కర్స్ యూనియన్ల నిరసన

ప్రజాశక్తి- యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం, మోటార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ, భారతీయ న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 106 (1) (2) ప్రకారం యాక్సిడెంట్ కేసులలో డ్రైవర్లకు ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారని తెలిపారు. డ్రైవర్లను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసలు ప్రమాదాలకు కారణాలను పరిశీలించకుండా, నివారణ చర్యలు చేపట్టకుండా డ్రైవర్లనే పూర్తి బాధ్యత చేయడం సరి కాదన్నారు.

మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అప్పల రాజు మాట్లాడుతూ, మోటార్ కార్మికులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు ఇటువంటి కార్మిక వ్యతిరేక చట్టాలు తేవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆటో, మోటార్ కార్మికులు

పరవాడ : భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పరవాడ మండలం లంకెలపాలెం కూడలిలో ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ గోవిందు, కె.అప్పారావు, ఎన్ ముసిలి, డి మధు, వై నాగేష్, ఎస్ సన్యాసిరావు, రాంబాబు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

కూల్.. కూల్...

చోట్ల ఉరుములతో కూడిన వర్షం పడనుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్షాలతో పాటు పిడుగులు కూడా పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సోమవారం రాత్రి వెల్లడించింది. ఆయా జిల్లాల కలెక్టర్‌లు తగు శ్రద్ధతో యంత్రాంగం ద్వారా పరిస్థితులను తెలుసుకుని ముందుకు సాగాలని ప్రజలు ఎక్కడా టవర్స్ కింద, చెట్ల కింద, ఎలక్ట్రిక్ పోల్స్ కింద ఉండకూడదని హెచ్చరికలను విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

సత్వరమే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టులకు సత్వరమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, అర్బన్ అధ్యక్షులు పి.నారాయణ కోరారు. డైమండ్ పార్క్ సమీపంలోని ఒక హోటల్లో సోమవారం ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ల కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల పెండింగ్ సమస్యలపై కార్యవర్గ సభ్యులంతా చర్చించారు. అనంతరం గంట్ల శ్రీను బాబు, నారాయణ మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కలగానే మిగిలిపోతున్నాయన్నారు. గతములో టిడిపి, మొన్నటి వైసిపి జర్నలిస్టు ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు పెట్టించినా ప్రక్రియ సాగలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టుల అక్రిడేషన్‌లతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. తమ జాతీయ, రాష్ట్ర కార్యవర్గాలు త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఈ విషయాన్ని నివేదిస్తామని చెప్పారు. 13వతేదీన అర్బన్ యూనిట్ కార్యవర్గ ఎన్నికలు, బ్రాడ్ కాస్ట్ ఎన్నికలు మహాజనసభలతో పాటు రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు త్వరలో విశాఖలోనే నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు జి.శ్రీనివాసరావు, ఎపిబిజెఎ విశాఖ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఎపిడబ్ల్యూజె ఉపాధ్యక్షులు బి.శివప్రసాద్, పితాని ప్రసాదరావు, ఎన్ రామకృష్ణ, నిర్వాహక కార్యదర్శి ఎ.సాంబరావు, ప్రతినిధులు కెఎస్.శర్మ, బి.ఆనంద్, టి.కృష్ణమూర్తి, పి.నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ కింగ్స్ విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ -3లో భాగంగా తొలి మ్యాచ్లో విజయం సాధించిన రాయలసీమ కింగ్స్ సోమవారం సాయంత్రం విశాఖలో విజయోత్సవ సంబరాలను నిర్వహించింది. తొలి మ్యాచ్లో కోస్టల్ రైడర్స్‌పై విజయం సాధించడంతో జట్టు సభ్యులు బీచ్ రోడ్‌లోని హోటల్లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కెప్టెన్ గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సీజన్‌ను విజయంతో ప్రారంభించినందుకు ఎంతో సంతోషిస్తున్నామన్నారు మ్యాచ్లో రోషన్, వినయ్ తమ ప్రతిభ చాటారని తెలిపారు. తమ తదుపరి బ్యాచ్ రెండవ తేదీ మధ్యాహ్నం అదే వేదికపై వైజాగ్ వారియర్స్‌తో ఉందని తెలిపారు.

తగ్గిన డెంగీ జ్వరాలు : డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో గత ఏడాది కంటే డెంగీ జ్వరాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. డెంగీ మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద డెంగీ దోమలు పెరిగే ప్రదేశాలపై అవగాహన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం డ్రై డే సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా దోమల ఉత్పత్తిని నియంత్రించి తద్వారా డెంగ్యూ జ్వరాల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. రానున్న మూడు నెలలు వర్షాకాలం కావడంతో నీటి నిల్వలపై యాంటీ లార్వా సిబ్బంది దృష్టి సారించి దోమ లార్వాలను పెరగకుండా అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. జోనల్ మలేరియా అధికారిని ఎం.శాంతిప్రభ, జిల్లా మలేరియా అధికారిని తులసిరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, ప్రతి శుక్రవారం ఇంటిలో నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి బయాలజిస్ట్ సాంబమూర్తి, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపిహెచ్ఒ శేషుబాబు, జివిఎంసి సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్నాథ స్వామి ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : టౌన్ కొత్త రోడ్డు ప్రధాన రహదారిలో జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవాలు సందర్భంగా జగన్నాథ స్వామి ప్రచార రథాన్ని సోమవారం సాయంత్రం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి వారి సేవలో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్ రెడ్డి, ఆలయ అర్చకులు జగన్నాథ ఆచార్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై సిఎం, డిప్యూటీ సిఎం స్పందించాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉక్కునగరం: ప్రమాదంలో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పందించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1236వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎల్ఎంఎంఎం, ఎస్‌బిఎం విభాగాల కార్మికులు, పోరాట కమిటీ నాయకులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికలు తరువాత దేశవ్యాప్తంగా అనేక అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాయని, ఒక్క విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. లాభాల్లో ఉన్న కంపెనీని ఉద్దేశపూర్వకంగా నష్టాల్లోకి నెట్టి మూడున్నరేళ్లకుపైగా వెంటిలేటర్‌పై ఉన్న ప్లాంట్‌ను కాపాడాల్సిన ఆవశ్యకతపై రాష్ట్ర నేతలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రధానమంత్రితో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మాట్లాడి ఉక్కు పరిరక్షణ, ప్రభుత్వ రంగంలో కొనసాగింపు, వర్కింగ్ క్యాపిటల్, ఆర్థిక పరిపుష్టి, సెయిల్‌లో విలీనంపై త్వరితగతిన ప్రకటన చేయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అంశాన్ని కూడా త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఉక్కు ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు వెంటనే ఇవ్వాలని, ప్లాంట్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలు, భారీ కుంభకోణాలపై సిబిఐ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ ద్వారా దర్యాప్తుకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్ష శిబిరంలో దాసరి సురేష్, కామేశ్వరరావు, శ్రీనివాస్‌నాయుడు, దాసరి శ్రీనివాస్, సీతారామరాజు, బషీర్‌బాబు, ఎం.రామకృష్ణ, ఎస్.గోపాల్‌రాజు, పి.రాజేంద్రనాథ్, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలి

విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేస్తూ తక్షణం ప్రకటించాలని సిఐటియు ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.లక్ష్మి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1187వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలంటూ, గతంలో అసెంబ్లీ చేసిన తీర్మానానికి, రాష్ట్రంలో అధికారం కొచ్చిన కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, ఆ తీర్మానం మేరకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో కుమారి, సునీత, వరలక్ష్మి తదితరులు కూర్చున్నారు.

రక్తికట్టించిన 'లవకుశ'

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

శ్రీ భానోదయ నాట్యమండలి (సురభి) హైదరాబాద్ 140వ వార్షికోత్సవ సందర్భంగా విశాఖలోని కళాభారతిలో నిర్వహిస్తున్న నాటకోత్సవాల్లో భాగంగా మూడవరోజు లవకుశ నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించారు. కళాకారులు తమతమ పాత్రలను రక్తి కట్టించారు. నాటకంలో భాగంగా శ్రీరామ పట్టాభిషేకం, గర్భవతిగా ఉన్న సీతను శ్రీరాముడు బహిష్కరించడం, శ్రీరాముడు ఆదర్శ పురుషునిగా జీవించడం, సీత అడవికి వెళ్ళడం, అక్కడ కవలలు జన్మించడం తదితర సన్నివేశాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పూర్వ డిప్యూటీ మేయర్ డాక్టర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ, అంతరించి పోతుందనుకున్న సురభి నాటక సంస్కృతిని పరిరక్షించి నేటికీ నిలిచేలా చేసిన మహనీయుడు పద్మశ్రీ బాబ్జి అని కొనియాడారు. సురభి కుటుంబం చెక్కు చెదరకుండా నాటకమే జీవనోపాధిగా అప్పుడే పుట్టిన పాపాయి మొదలు అన్ని వయసుల వారు అన్ని పాత్రలూ పోషిస్తుండటం వారికే చెల్లిందన్నారు. సురభి పౌరాణిక చారిత్రాత్మక సంప్రదాయాన్ని విశాఖకు పరిచయం చేసి ఉత్తరాంధ్రకు చేరువ చేస్తున్న ఆ కుటుంబ సన్నిహితుడు బాదంగీర్ సాయి విశాఖ వాసి కావడం గర్వకారణమన్నారు. బాదంగీర్ సాయి మాట్లాడుతూ, రంగశాయి నాటక సంఘం ఆధ్వర్యాన పద్మశ్రీ బాబ్జి పేరుతో ఆయన జీవితకాల పురస్కారం నాటక రంగ ప్రముఖులకు ప్రదానం చేస్తున్నట్లుగా చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీన కళాభారతి వేదికపై పద్మశ్రీ సురభి బాబ్జి జీవితకాల పురస్కారం ఒక నాటక రంగ ప్రముఖునికి ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగనబోయిన నాగేశ్వరరావు, నంది అవార్డుల గ్రహీత డాక్టర్ మీగడ రామలింగస్వామి, ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సింహాద్రి నాయుడు, పద్మశ్రీ సురభి బాబ్జి అవార్డు గ్రహీత నవరసమూర్తి, నటులు, దర్శకులు కెవిఎన్‌డి.ప్రసాద్, వర్రె నాంచారయ్య, శివజ్యోతి, కన్నబాబు, పైడి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పిజిఆర్ఎస్) వచ్చే అర్జీదారులతో జిల్లా అధికారులు మమేకమై, సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ చెప్పారు ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, పెండింగ్ అర్జీలు ఉండరాదని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం డిఆర్ఒ అధ్యక్షతన జివిఎంసి ఎడిసి ఎస్ఎస్.వర్మ, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, పోలీసు అధికారులతో కలిసి అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రతి అధికారీ విధిగా హాజరుకావాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల్లో పనిచేసే అధికారులు ఒక వారం ఈ జిల్లాలో, తదుపరి వారం మరో జిల్లాలో హాజరు కావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 218 మంది అర్జీదారులు తమ వినతులను సమర్పించారు. 69 రెవెన్యూ, 70 జివిఎంసి, 17 పోలీస్, 62 అర్జీలు ఇతర శాఖలకు చెందిన సమస్యలుగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ టి.సీతారామారావు, సునీత, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు డి.అఖిల, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు, డిఎల్‌డిఒ ఆర్.పూర్ణిమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ వారియర్స్ టైటిల్ స్పాన్సర్‌గా ఫన్88 న్యూస్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) ప్రస్తుత సీజన్ కోసం తమ అధికారిక టైటిల్ స్పాన్సర్‌గా ఫన్88 న్యూస్‌తో వైజాగ్ వారియర్స్ జట్టు తమ స్పాన్సర్‌షిప్ ఒప్పందాన్ని ప్రకటించింది. బీచ్ రోడ్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వైజాగ్ వారియర్స్ జట్టు సహ యజమాని డాక్టర్ నరేంద్ర రామ్ మాట్లాడుతూ, వైజాగ్ వారియర్స్ జట్టు బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ) చేత గుర్తించబడిన ఎపిఎల్‌లోని అగ్ర పోటీ జట్లలో ఒకటి అని, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ద్వారా 2022లో ఎపిఎల్‌లో అడుగు పెట్టినప్పటినుంచి ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్‌ను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్), జాతీయ జట్టుకు చేరుకునే సామర్థ్యంతో ఆటగాళ్లకు తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి వేదికను అందించడంతోపాటు యువ ప్రతిభను పెంపొందించడం ఈ లీగ్ లక్ష్యమన్నారు.

వర్షాకాలంలో శిశువు చర్మాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వర్షాకాలంలో శిశువు చర్మాన్ని కాపాడుకోవాలని మారికో లిమిటెడ్ చీఫ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ శిల్పా వోరా సూచించారు. పెరిగిన తేమ, తడిదనం చిన్నపిల్లల రోగనిరోధక శక్తిని తగ్గించడమే కాకుండా దద్దుర్లు, చర్మం ఎరుపెక్కడం, ఇన్ఫెక్షన్ల వంటి వివిధ చర్మ సమస్యలను కూడా కలిగిస్తాయని వివరించారు. ఒక హోటల్లో ఆమె మీడియాతో మాట్లాడుతూ శిశువు చర్మం చాలా సున్నితంగా, పెద్ద వారి కంటే 30 శాతం సన్నగా ఉంటుందన్నారు. తక్కువ లిపిడ్లతో, పెళుసుగా, పొడిగా ఉండేలా చేస్తుందన్నారు. వర్జిన్ కొబ్బరి నూనె శిశువు మదువైన చర్మాన్ని సున్నితంగా ఉంచుతుందన్నారు. వర్జిన్ కొబ్బరి నూనెతో సుసంపన్నమైన పారాచూట్ అడ్వాన్స్‌డ్ బేబీ నవజాత శిశువు చర్మం మాయిశ్చరైజింగ్ అవసరాలను తీర్చడానికి రూపొందించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ డిఇఒ సువర్ణ

ప్రజాశక్తి- పెందుర్తి : మండలంలోని పాపయ్య రాజుపాలెం, గొల్లవిల్లివానిపాలెం, పురుషోత్తపురం, గిరిప్రసాద్‌నగర్ ప్రభుత్వ పాఠశాలల్లోని 350 మందికి విద్యార్థులకు సోమవారం హిమగీత, ప్రత్యూష, యు.దుర్గాప్రసాద్ సహకారంతో సుజాతనగర్ సత్యసాయి భక్తబృందం, ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, ఎరైజర్స్, షార్ప్‌నర్స్, స్కేల్స్, బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా ఉప విద్యాశాఖాధికారి, పెందుర్తి ఎంఇఒ సువర్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రోత్సాహానికి మధ్యాహ్న భోజనంతోపాటు స్టూడెంట్ కిట్స్, ఇతర ప్రయోజనాలను కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సత్యసాయి భక్తబృందం సేవలను కొనియాడారు.భక్తబృందం సభ్యులు ఎం.గోపి, పి.తాతా రావు, టి.సీతారామయ్య, సిహెచ్.రవి శంకర్, మూర్తి, భవాని, దివ్య, నాగమణి, రామలక్ష్మి పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నారు పోతలు

ప్రజాశక్తి-పద్మనాభం : ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు ఖరీఫ్ పనుల్లో బిజీగా ఉన్నారు. పలు గ్రామాల్లో వరి నారుమళ్లను సిద్ధం చేసి, ఇప్పటికే కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్న వరివిత్తనాలను నారుమళ్లలో చల్లేపనుల్లో తలమునకలై ఉన్నారు. వీడకుండా వర్షాలు కురుస్తుండడంతో వరినారుమళ్లలో అదును చిక్కని పరిస్థితుల్లో దమ్ము పట్టి వరివిత్తనాలను చల్లుతున్నారు. కృష్ణాపురం గ్రామంలో సోమవారం కొంతమంది రైతులు ఇలా దమ్ము పట్టి వరివిత్తనాలు చల్లారు. ప్రభుత్వం సరఫరా చేసిన వరి విత్తనాలను రైతులు కొనుగోలు చేసుకుని సిద్ధంగా ఉంచి, వాటిని నారుమళ్లలో చల్లుతున్నారు.

రజక వృత్తిదారుల హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి మాధవధార : . ఎన్నికలకు ముందు రజక వృత్తిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం. కంచరపాలెం సిఐటియు కార్యాలయంవద్ద రజక వృత్తిదారుల సంఘం సమావేశంలో మాట్లాడుతూ కంచరపాలెం ప్రాంతంలో నివసించేందుకు రజకులకు పక్కాఇళ్ళు, వృత్తిస్థలాలు, దోబీఘాట్లు మంజూరు చేయాలని, రజకుల రక్షణకు సామాజిక చట్టం చేయాలని, 50ఏళ్ల నిండిన వారికి పింఛన్లు మంజూరు చేయాలని, దోబీ పోస్టులను రజకులతోనే భర్తీ చేయాలని,. లాండ్రీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ మంజూరు చేయాలన్నారు కార్యక్రమంలో ఎస్.ఈశ్వరరావు . బి చిన్నారావు, ఎం అప్పారావు, కె. శ్రీను, బి రాజారావు, ఎం తిరుపతిరావు పాల్గొన్నారు.

పిఆర్‌జిఎస్‌లో వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న ఐదో జోన్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి- విశాఖపట్నం: జివిఎంసి ఐదో జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నాలుగు వినతులు వచ్చాయని జెడ్‌సి ఆర్‌జివి.కృష్ణ తెలిపారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి చెరో రెండు అర్జీలు రాగా, వాటిని స్వీకరించిన జెడ్‌సి, పరిష్కారానికి చర్యలు చేపడతా మన్నారు. కార్యక్రమంలో ఇ. మత్స్యరాజు, తారాప్రసన్న, ఎసిపి. వెంకటరావు, ఎపిడి పద్మావతి, ఎఎంహెచ్ఒ డాక్టర్ సునీల్ కుమార్, చిరంజీవి పాల్గొన్నారు

భీమునిపట్నం :స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిఆర్‌జిఎస్)లో ఐదు అర్జీలు అందాయి. జోనల్ కమిషనర్ కె కనక మహాలక్ష్మి పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి నాలుగు, ప్రజారోగ్య విభాగానికి ఒక అర్జీ రాగా, తదుపరి చర్యలకు ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు జెడ్‌సితెలిపారు

'అవంతి'లో బిటెక్ ఇసిఇ, సిఎస్ఇలో
అదనపు సీట్లు పెంపునకు అనుమతి

ప్రజాశక్తి-తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ సిఎస్ఇ, ఇసిఇ విభాగాల్లో అదనపు సీట్లు పెంపునకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతి ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్రశేఖర్ తెలిపారు. సిఎస్ఇ విభాగంలో 180 నుంచి 300 సీట్లు, ఇసిఇ విభాగంలో 120 నుంచి 180 సీట్లకు పెంచేందుకు అనుమతి లభించడంపై హర్షం వెలిబుచ్చారు.

అప్పన్నను దర్శించిన సిబిఐ జాయింట్ డైరెక్టర్

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామిని సోమవారం తెలంగాణకు చెందిన సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేష్ ప్రభు దర్శించుకున్నారు ఆయనకు ఆలయ కార్య నిర్వహణ ాధికారి శ్రీనివాసమూర్తి ఆదేశం మేరకు ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి ఆనందకుమార్, పర్యవేక్షణ అధికారి పిల్లా శ్రీను, పిఆర్ఒనాయుడు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు, సింహాచలేశుని సన్నిధిలో ప్రత్యేక పూజలు ఎఇఒ ఆనందకుమార్ స్వామి శేష వస్త్రంతో సత్కరించి,ప్రసాదాలను అందజేశారు..విశాఖ సిబిఐ ఎసిపి ఎస్‌పి రంభ మురళి, సిఐ శ్రీనివాస్ఉన్నారు

డయేరియా నియంత్రణపై అవగాహన ర్యాలీలు



బుచ్చయ్యపేటలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశానుసారం స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రి నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు డయేరియా నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిధిలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ చంద్రశేఖర్, పాఠశాల ఆరోగ్య విభాగ అధికారి డాక్టర్ ప్రశాంతి, ఎపిడమాలజిస్ట్ సతీష్ కుమార్, గణాంక శాఖ అధికారి రామచంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాక : మునగపాక, చూచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యాన ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎన్. విమలగిరి, ఎస్తేరు రాణి, వైద్య సిబ్బంది దేవకాంత, ఎం నాగేశ్వరరావు, ఎఎన్ఎం దేవకి, సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపిటిసి కాండ్రేగుల కిరణకుమార్, డాక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

కశింకోట : కసింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యాన ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారులు యశోద, డాక్టర్ యు రమేష్, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : బుచ్చయ్యపేటలో అతిసార వ్యాధి నివారణపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బుచ్చయ్యపేట పిహెచ్సి వైద్యాధికారి వెంకటకృష్ణ, సిహెచ్ఒ దేవుడు, త్రిమూర్తులు, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : డయేరియా నివారణపై హరిపాలెం, అచ్యుతాపురం పిహెచ్‌సిల ఆధ్వర్యంలో ఆవ సోమవారం, హరిపాలెం, గ్రామాలలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పీహెచ్సీ వైద్యాధికారులు కళ్యాణి, వసంత కుమార్, ఎంపిడీవో సురేష్ కుమార్, ఈవోపీఆర్డి శ్రీరాములు నాయుడు పాల్గొన్నారు.

మాడుగుల: డాక్టర్స్ డే సందర్భంగా మాడుగులలో డయేరియా నిర్మూలన ర్యాలీని కేజే.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు లీలా ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు లీలాప్రసాద్ మాట్లాడుతూ,. పిల్లలు, పెద్దలు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. పరిశుభ్రతతోనే డయేరియా నిర్మూలన సాధ్యమన్నారు .కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్ సూచించారు. మండల కేంద్రంలో డయేరియా నియంత్రణపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కొసిపల్లి అప్పారావు, వైద్యాధికారి కీర్తి, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాడుగులలో పోస్టర్లతో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

ఆనందపురం: 'స్టాప్ డయేరియా'పై ప్రజల్లో అవగాహనకు సోమవారం వేములవలసలో ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం వర్షాల సీజన్‌లో ఐదేళ్లలోపు పిల్లల్లో వాంతులు, విరోచనాలు వంటి అతిసార వ్యాధి లక్షణాలతో పిల్లలు బాధపడే అవకాశం ఉందని, వారిని డయేరియా నుంచి రక్షణకు అవగాహనకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. డయేరియా లక్షణాలు కనబడిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యసేవలు పొందాలని సూచించారు. చేతి పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ షహనాజ్ సాధియ, సిహెచ్ఒ పి సాంబమూర్తి, హెచ్ఎస్ కృష్ణమోహన్ పార్వతమ్మ, సెవెన్ హిల్స్ నర్సింగ్ స్కూల్ ప్రతినిధి డి.హైమావతి, నర్సింగ్ విద్యార్థులు, ఆరోగ్య , ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

10 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- గాజువాక : విశాఖ జిల్లా గాజువాక చైతన్య నగర్‌లోని జయంతి అపార్ట్‌మెంట్‌లో 10 కిలోల గంజాయిని గాజువాక పోలీసులు పట్టుకున్నారు. జయంతి అపార్ట్‌మెంట్‌లో ప్రయివేటు హాస్టల్‌ను తోట రాజేష్ నడుపుతున్నారు. ఇతను గంజాయిని తెచ్చి కావలసిన వారికి సరఫరా చేస్తున్నారు. ముందస్తు సమాచారం సోమవారం పోలీసులు తనిఖీ చేయగా 10 కిలోల గంజాయి పట్టుబడింది. రాజేష్‌తో పాటు ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

తాగునీటి అక్రమ వినియోగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడ గ్రామ రెవెన్యూ పరిధిలో తాగునీటిని మోటార్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమ వారం ఫిర్యాదు చేసినట్లు నాల్గో వార్డు టిడిపి నాయకులు సూరాడ నరసింగరావు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లో అక్రమ నీటి వ్యాపారానికి తెరలేపి భారీగానే ఆర్జించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో భూగర్భజలాలు అడుగంటి, చిన మంగమారిపేట, విబిసి కాలనీ, నరసింహనగర్ జంక్షన్‌లో ఉన్న ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పలు రొయ్యల పరిశ్రమల యాజమాన్యాలు కూడా తాగునీటిని పరిశ్రమల అవసరాలకు అడ్డగోలుగా వాడుతుండడం వల్ల నీటి కొరత ఏర్పడుతోందన్నారు.

బిళ్ళలమెట్ట ఇళ్ళ స్థలాల కేటాయింపుపై ఫిర్యాదు

జివిఎంసి ఒకటోజోన్ సంగివలస రెవెన్యూ పరిధిలో బిళ్ళల మెట్టలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు భాగం గోపాలరావు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఇళ్ళ స్థలాల కేటాయింపుపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. పేదలకు ఇచ్చే స్థలాలను కొందరు ప్లాట్లుగా అమ్మకాలు జరుపుతుండడంపై లోతుగా విచారణ జరిపించాలని కోరారు. కొత్తవలస రెవెన్యూ పరిధిలో ఓ పీఠాధిపతి కి గత వైసిపి ప్రభుత్వం కేటాయించిన 15ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకుని, అర్హత గల స్థానిక పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరారు.

శత వసంతాల వేడుక నిర్వహణపై
7న పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పడి వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శతవసంతాల వేడుక నిర్వహణపై చర్చించేందుకు ఈనెల 7న పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించనున్నట్లు హెచ్ఎం పొన్నగంటి రమణ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో మాజీ కౌన్సిలర్, పాఠశాల పూర్వ విద్యార్థి మైలపల్లి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశం హెచ్ఎం మాట్లాడుతూ, 1924లో ప్రారంభించిన ఈ పాఠశాల నేటికి వందేళ్లు పూర్తిచేసుకుందన్నారు. వేడుకల నిర్వహణపై సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఈనెల 7న సమావేశం నిర్వహిస్తామన్నారు. వేడుకల నిర్వహణ కన్వీనర్‌గా పూర్వ విద్యార్థి, కన్వీనర్ లక్ష్మణరావును ఏకగ్రీవంగా నియమించినట్లు తెలిపారు. సమావేశంలో పూర్వ విద్యార్థి గాడు అప్పలనాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు టి భీమారావు పాల్గొన్నారు

ఘనంగా 'కంచర్ల' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : సినీ నిర్మాత, ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ సిఎండి, ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ అధినేత, సకల కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు, టిడిపి నాయకుడు డాక్టర్ కంచర్ల అచ్యుతరావు పుట్టిన రోజు వేడుకలను ఆరిలోవ నెహ్రూనగర్‌లో సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సినీ సంగీత విభావరి, వివిధ వినోద సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. డాక్టర్ కంచర్ల పుట్టినరోజు వేడుకల్లో వివిధ సంగీత, జానపద, వంటి సకల కళాకారులు పెద్ద ఎత్తున హాజరై డాక్టర్ కంచర్ల కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు సింహాచలం దేవస్థానం ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు పాల్గొని, ఉపకార్ ట్రస్ట్ సభ్యుడు ధనరాజ్ తల్లి వైద్యానికి చేయూతతో భాగంగా ఆటో అందజేశారు.ఉపకార్ ట్రస్ట్ ఇంఛార్జి సుధీర్, కంచర్ల వ్యక్తిగత కార్యదర్శి సిద్ధార్థ, హ్యూమన్ రైట్స్ కమిషన్ అధ్యక్షుడు పారిపల్లి రామా రావు, విశాఖ గాయకులు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, విజెఎఫ్ మాజీ ఉపాధ్యక్షుడు నాగ రాజు పట్నాయక్, డొనాల్డ్ డక్ క్రీడాకారుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు

ప్రజాశక్తి డాక్టర్స్‌డే ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



విజయశ్రీ హాస్పిటల్‌లో ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ వేణుమాధవి

ప్రజాశక్తి- మధురవాడ : డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన డాక్టర్స్‌డే ప్రత్యేక సంచికను పిఎంపాలెం క్రికెట్ స్టేడియం దరి విజయశ్రీ హాస్పిటల్‌లో న్యూరాలజిస్ట్ డాక్టర్ బగాది సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ పైడి వేణుమాధవి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ, ఎటువంటి లాభాపేక్ష లేకుండా 44 ఏళ్లుగా ప్రజాసమస్యలను వెలుగులోకి తేవడం, వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్న ప్రజాశక్తి తెలుగు దినపత్రిక ఏటా మాదిరిగానే డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను అభినందిస్తూ ప్రత్యేక సంచికను తీసుకురావడం అందులో ప్రజారోగ్యానికి సంబంధించి సలహాలు, సూచనలతో ప్రత్యేక కథనాలను ప్రచురించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి యాజమాన్యానికి, సిబ్బందికి, పాత్రికేయులకు డాక్టర్ సునీల్‌కుమార్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విజయశ్రీ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చట్టి బాబు షష్టి పూర్తి వేడుక



రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక ఆటోనగర్ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చట్టి బాబు జన్మదినం, షష్టిపూర్తి వేడుకలను సోమవారం పంతులు గారి మేడ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు 300 మంది రక్తదానం చేశారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతోపాటు పలువురు బంధువులు, స్నేహితులు, టిడిపి, కూటమి శ్రేణులు వేడుకల్లో పాల్గొని, చట్టిబాబుకు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

'స్వాతి' కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు



కృష్ణారెడ్డికి పలువురి జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార: స్వాతి ప్రమోటర్స్ సంస్థ ఛైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం సీతమ్మధారలోని సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ సంస్థ ఎదుగుదలలో సిబ్బంది కృషి మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా సిబ్బందితోపాటు పలువురు కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలపగా, వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో స్వాతి ప్రమోటర్స్ సంస్థ ఎండి మేడపాటి రమేష్‌రెడ్డి,డ ఎజిఎంలు, సిజిఎంలు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పదేపదే గడువు పొడిగింపుపై
శిక్షణ ఎఎన్ఎంల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ట్రైనీ ఎఎన్ఎంలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎఎన్ఎంఎల్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న తమకు రిలీవ్ లెటర్స్ ఇవ్వకుండా పదేపదే గడువును పొడిగించడాన్ని నిరసిస్తూ ట్రైనీ ఎఎన్ఎంలు నిరసన చేపట్టారు. సోమవారం రామాటాకీస్ దరి డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద నిరసన సందర్భంగా యూనియన్ ప్రతినిధి కృష్ణవేణి మాట్లాడుతూ 2022 నుంచి 2024 మార్చి ఒకటవ తేదీ వరకు తాము ఎఎన్ఎంఎల్‌గా రెండేళ్ల శిక్షణ పూర్తిచేసుకున్నామని, అప్పటోల రిలీవ్ లెటర్ అడిగితే, రెండు నెలల శిక్షణ గడువు పెంచామని, దాన్ని పూర్తిచేసిన వెంటనే రిలీవ్ లెటర్లు ఇస్తామని చెప్పారన్నారు. పెంచిన గడువు మేరకు రెండు నెలల శిక్షణకూడా పూర్తిచేసిన తర్వాత ఇపుడు రిలీవ్ లెటర్లు అడిగితే మరో నెల శిక్షణ పొందాలని సూచిస్తూ రిలీవ్ లెటర్లు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై జిల్లా కలెక్టర్, డిఎంహెచ్ఒలకు విన్నవించి, తమకు న్యాయం చేయాలని వేడుకున్నా స్పందించడం లేదన్నారు. తాము పొందిన శిక్షణకు రిలీవ్ లెటర్లు ఇస్తే, తమ ప్రాంతాల్లో ఏదైనా ఉద్యోగాలు చేసుకుంటామని వేడుకుంటున్నా స్పందించడ లేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, డిఎంహెచ్ఒ స్పందించి, తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

జన్యువ్యాధుల చికిత్సకు ఎల్‌విపిఇఐ పరిశోధన

ప్రజాశక్తి - ఆరిలోవ : కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జినోమిక్స్ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ, ఎల్‌వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికత కంటే మరింత ఆధునిక, సమర్థవంతమైన జన్యు వవరణ సాధనాన్ని పరీక్షించారు. డాక్టర్ ఇందుమతి మారియప్పన్ నేతృత్వంలో ఎల్‌విపిఇఐ పరిశోధకులు ఈ కొత్త సాధనాన్ని చిన్న వయస్సులో తీవ్రమైన దృష్టి లోపానికి దారితీసిన లెబర్స్ కాంజినీటల్ అమౌరోసిస్ టైప్ -2 అనే అరుదైన, జన్యుపర కంటివ్యాధి ఉన్న రోగి నుంచి తీసుకున్న కణాలలో పరీక్షించారు. ఈ వ్యాధి కంటిలో సాధారణ ప్రొటీన్ ఉత్పత్తికి అంతరాయం కలిగించే ఒక జన్యు పరివర్తన కారణంగా వస్తుంది. ఎల్‌విపిఇఐ బృందం రోగి చర్మ కణాలను తీసుకొని, అదే జన్యు పరివర్తనాన్ని కలిగిన స్టెమ్ సెల్స్‌గా వాటిని పునర్వ్యవస్థీకరించారు. తరువాత వారు స్టెమ్ సెల్స్‌లో పరివర్తనాన్ని సరిచేసేందుకు ఇఎన్ఎఫ్ఎన్‌సిఎస్9 సాధనాన్ని ఉపయోగించారు. సరిచేసిన కణాలు పరివర్తనం విజయవంతంగా పరిష్కరించివిడిందని నిరూపిస్తూ, మళ్ళీ సాధారణ ప్రొటీన్ ఉత్పత్తి చేయగలిగాయని నిరూపించినట్టు డాక్టర్ మరియప్పన్ తెలిపారు.

'మధ్యాహ్న' భోజన అమలుపై సమీక్ష



సమీక్షిస్తున్న కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని ప్రభుత్వ పాఠశాలలకు అక్షయపాత్ర సంస్థ ద్వారా మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యాశాఖ, ఐసిడిఎస్, పౌరసరఫరాలు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సమీక్షించారు. సోమవారం కప్పరాడలోని అక్షయపాత్ర కార్యాలయం వద్ద నిర్వహించిన సమీక్షలో ముందుగా వంట తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ పరిస్థితులు, శుచి, శుభ్రత, వారికి ప్రభుత్వపరంగా సరఫరా చేస్తున్న సరుకులు, వాటి నాణ్యత, పరిమాణం తదితర అంశాలపై పరిశీలన చేశారు. నగరంలోఎన్నిపాఠశాలల్లో ఎంతమంది విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం సరఫరా జరుగుతుంది, దాని అమలుపై విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ, వాటికి సంబంధించిన రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన అమలుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంలో సూచనలు చేశారు. పౌరసరఫరాల విభాగం ద్వారా బియ్యం, పప్పుదినుసుల పంపిణీపై ప్రశ్నించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన అమలుకు సంబంధించి సమస్యల నమోదుకు ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులు భోజన అమలుపై తరచూ పర్యవేక్షణ జరిపి, మెనూ అమలు, ఇతర సమస్యలుంటే కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాలల్లోని వందశాతం విద్యార్థులు మధ్యాహ్నభోజనం తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు సమీక్షలో సివిల్ సప్లయిస్ డిఎం ఐ.రాజేశ్వరి, అక్షయపాత్ర మేనేజర్ వి.రామ్మోహన్, ఎంఇఒలు ఎ..సోమేశ్వరరావు, డి.దివాకర్, కెవి.బాలామణి, విద్యాశాఖ ఎడిఎ .జ్యోతి, సిడిపిఒలు ఎంవిఆర్.కుమారి, శ్రీలత, జిల్లా బాలల సంక్షేమ విభాగం పిఒ రమేష్,అక్షయ పాత్ర ఆపరేషన్ మేనేజర్ కె.జానకిరాం, క్వాలిటీ విభాగం అధికారి సిహెచ్.విజయ కుమార్, సిఆర్ఎంటిలు, అంగన్వాడీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా చొక్కాకుల పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-సీతమ్మధార: విశాఖ వికెపిసిపిఐఆర్ యుడిఎ మాజీ ఛైర్మన్ చొక్కాకుల వెంకటరావు జన్మదిన వేడుకలను సోమవారం సీతమ్మధారలోని వారి కార్యాలయంలో అభిమానులు, నాయకులు మధ్య ఘనంగా జరుపుకున్నారు. జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు విచ్చేసి కేక్ కట్ చేసి, చొక్కాకుల వెంకటరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బగాది విజయకుమార్, రంది పరదేశినాయకుడు, కోరుబిల్లి విజయకుమార్, ఒమ్మి నారాయణరావు, కంటిపాము గురువోజీ, ఆదిరెడ్డి అప్పారావు, సారిపల్లి సంతోష్, సింగంపల్లి రామారావు, సబ్బవరపు శ్రీను, గొర్లె చంద్రమౌళి, ఎన్.కృష్ణ, కర్రి శంకరరావు, కోరుబిల్లి నర్సింగ్, సుకుమార్, సురేష్, కనకరాజు, భరతవల్లి, నేపాల్ శ్రీను, మాతా ఈశ్వరరావు, రొంగలి బుచ్చునాయుడు, మేడపురెడ్డి జగన్నాథం, గొంప దేవుడుబాబు, తర్రా సతీష్, రాజేష్, పాల్గొన్నారు.

కొరటాలకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి జనరల్ మేనేజర్, సిబ్బంది

ప్రజాశక్తి- విశాఖపట్నం : రైతు ఉద్యమ నేత, సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, ఆ పార్టీ పొలిట్ బ్యూరో మాజీ సభ్యులు కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో ఆ సంస్థ సిబ్బంది సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు కొరటాల చిత్ర పటానికి పూలమాల వేయగా, సిబ్బంది పూలతో శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజాశక్తి సబ్ ఎడిటర్ ఆర్‌కె.నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాశక్తి సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షునిగా కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ ప్రజాశక్తి నడకకు, ఎదుగుదలకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. కొరటాల చూపిన మార్గంలో ప్రజాశక్తిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



గోడ గడియారాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి ఉన్నత పాఠశాలలో 2012 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. విజయవాడ, భీమవరం, చోడవరం తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చిన వీరంతా ఒకేచోట కలిసి, నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఉత్సాహంగా గడిపారు. ఆప్యాయంగా పలకరించుకుని, పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు గోడ గడియారాలను బహూకరించారు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు దత్తి ఈశ్వరరావు, నాగభూషణరావు , ఎన్ సత్యరాజు, ప్రస్తుత హెచ్ఎం మాదా బత్తుల తిరుమల శ్రీదేవి తదితరులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులను వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, ఉపాధ్యాయులు అభినందించారు

కాలువ పూడికతీత పనులు ప్రారంభం



కాలువ పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సాగునీటి కాలువ పూడికతీత పనులకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. గోస్తనీ నది పరివాహక ప్రాంతం సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణాపురం గ్రామంలో ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుంది. సాగునీటి కాలువలో పూడికతీత పనులు ప్రారంభించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కె.రమణ, తెలుగు మహిళారాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.లీలావతి మాజీ జడ్‌పిటిసి కె దామోదరరావు, టిడిపి మాజీ అధ్యక్షులు కె.నగేష్ కుమార్ కె. సత్యనారాయణ, కె.రామస్వామి నాయుడు. పాల్గొన్నారు

అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టుకు రహస్య సర్వేను తక్షణమే నిలుపుదల చేయాలి

సిపిఎం నేతలు వెంకన్న, బిటి.దొర

ప్రజాశక్తి-దేవరాపల్లి

సరియా జలపాతం ప్రాంతంలోని రిజర్వు ఫారెస్టులో హైడ్రోపవర్ ప్రాజెక్టు కోసం అదాని కంపెనీకి చెందిన కోల్‌కతాకు చెందిన కొంత మంది చేస్తున్న రహస్య సర్వేను వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర డిమాండ్ చేశారు. సర్వే చేస్తున్న ప్రాంతాన్ని సోమవారం సిపిఎం నాయకులు స్థానిక గిరిజనులతో కలిసి పరిశీలించారు. అనంతరం సరియా గ్రామంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణం జరిగితే దేవరాపల్లి మండలంలోని వాలాబు సగం, అనంతగిరి మండలంలోని కొన్ని గ్రామాలతో పాటు చీడికాడ మండలం కోనాం ప్రాజెక్టు ఆయకట్టుదార్లకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. ఇక్కడి గిరిజనులను మోసం చేస్తూ ఫారెస్టు అధికారులు కళ్ళుగప్పి రహస్యంగా సర్వేలు నిర్వహిస్తున్నారన్నారు. ఇటువంటి వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ఇక్కడ పనులు నిలుపుదల చేయకుంటే అడ్డుకోవడానికి, ప్రత్యక్ష ప్రతిఘటనకు గిరిజనులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అత్యంత కీలకమైన బొడ్డేరు జీవ నదిపై పవర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే వేలాది ఎకారాలకు చెందిన కోనాం ఆయకట్టు రైతులు భూములు బీడీ భూములుగా మారుతాయని, ఈ ప్రాంత గిరిజన గ్రామాలు ఖాళీ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రిజర్వు ఫారెస్టులో సర్వే చేయాడానికి ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. రహస్యంగా సర్వే నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఈ ప్రాంతంలో హైడ్రోపవర్ ప్లాంట్‌కు ఎటువంటి అనుమతులు ఇవ్వరాదని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజనులు జర్రా రామరాజు, జర్రా రాజుబాబు, జర్రా అప్పలరాజు, శిరగం లక్ష్మణరావు, రంగిసింగి దేముడు తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో కలిసి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

గ్రామీణ తపాల ఉద్యోగులకు కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగులకు గత ప్రభుత్వం వేసిన కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేసి వారిని ఆదుకోవాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ జాతీయ నేత బివి రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనకాపల్లి కోడిగంటి గోవిందరావు భవన్లో ఎస్ సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఏఐజిడిఎస్ యూనియన్ అనకాపల్లి డివిజన్ ద్వైవార్షిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ తపాల ఉద్యోగులకు ఐదు లక్షలు గ్రాట్యూటీ , ఐదు లక్షలు వరకు కుటుంబ సభ్యులకు కలిపి వైద్య బీమా, మరో ఐదు లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. కమిటీ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయకుండా తాత్సారం చేయడం దుర్మార్గమన్నారు. డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఉద్యోగులు మాదిరిగానే గ్రామీణ తపాల ఉద్యోగులకు వేతన సవరణ జరపాలని కోరినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. అధికారులు ప్రభుత్వ స్కీములలో ఎక్కువమంది ఖాతాదారులను చేర్పించాలని టార్గెట్లు విధించి ఏరోజుకారోజు నివేదిక ఇవ్వాలని ఈ తపాల ఉద్యోగులను మానసికంగా వేధింపులకు గురి చేయడం దారుణమన్నారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 3న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు వివి రామకృష్ణ, పి.భూలోకం, ఏఐటియుసి నాయకులు వై ఎన్ భద్రం, శ్రీరామదాసు అబ్బులు, గంగరాజు, కోన లక్ష్మణ పాల్గొన్నారు. అనంతరం యూనియన్ అధ్యక్షునిగా ఎస్.సతీష్ కుమార్, కార్యదర్శిగా వి. దుర్గా ప్రకాష్, కోశాధికారిగా పి.నూకరాజు దొరను, ముగ్గురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సహాయ కార్యదర్శులు కోశాధికారి, సహాయ కోశాధికారులను ఎన్నుకున్నారు.

మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపిలో వికలాంగుల పించన్ల పెంపు నేపథ్యంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ సంఘ సభ్యులతో కలసి సోమవారం మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కరణం శివ, యలమర్తి రవి, కోరుకొండ నాగరాజు, దూళి శివ, చెట్టుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి క్రీడా కోటాలో డిపిఎన్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -కశింకోట

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ నూజవీడు ట్రిపుల్ ఐటీకి కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు దిలీప్, నవీన్, చందురాజు క్రీడా కోటాలో ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి.అప్పారావు సోమవారం తెలిపారు. వీరు ఈ నెల 4వ తేదీన ధ్రువపత్రాలు పరిశీలనకు నూజవీడు వెళ్తారని పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటికి ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.







చందురాజు, దిలీప్, నవీన్

జర్నలిస్టులకు ఉచితంగా వైద్య పరీక్షలు



జర్నలిస్టులకు చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలోని అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఉషా ప్రైమ్ మల్టీ స్పెషాలిటి హాస్పటలో ఉచితంగా చేపడుతున్న వైద్య పరీక్షలను సోమవారం స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిరంతరం బిజీగా ఉండే జర్నలిస్టులకు వారి ఆరోగ్యం పట్ల జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధతో ఉచిత వైద్య పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు. రోజుకు 50 మంది చొప్పున అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ అభివద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు జర్నలిస్టులు ఎంతో కీలకంగా వ్యవహరిస్తారని, అటువంటి వారికి, వారి జీవిత భాగస్వామికి ఉచిత వైద్య పరీక్షలు చేయించడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి యండి. డాక్టరు అవినాష్ మాట్లాడుతూ మంగళవారం నుండి డయాబెటిక్ ఉన్న వాళ్ళు ఉదయం 8 గంటల లోపు ఆసుపత్రికి వచ్చి అల్పాహారానికి ముందు రక్త పరీక్ష, అల్పాహారం తరువాత రక్త పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ చిన్ని క్రిష్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలాజీ, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ రంజిత్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు సానుకూలతతో సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

సానుకూల ధృక్పదంతో పోటీ పరీక్షలకు నిరుద్యోగులు సన్నద్ధం కావాలని డిప్యూటీ తహశీల్దార్ యలమంచిలి శ్రీరామ్మూర్తి (బుజ్జి) పిలుపునిచ్చారు. శ్రీ గౌరీ గ్రంథాలయంలో ఉపాధ్యాయ స్టడీ సర్కిల్ సహకారంతో టెట్, డీఎస్సీ పరీక్షకు ఆదివారం రాత్రి జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పోటీ పరీక్షల మెటీరియల్ కోసం ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్లును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరుద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా తయారు చేయాలనే సంకల్పంతో గౌరీగ్రంథాలయం నిర్వహిస్తున్న పోటీ పరీక్షల శిక్షణా తరగతుల ద్వారా శాశ్వత ఉపాధి పొందవచ్చని చెప్పారు. ఉపాధి పొందుతూ ప్రజలకు సేవ చేసే అవకాశం ప్రభుత్వ ఉద్యోగికే మాత్రమే దక్కుతుందన్నారు. విద్యార్థులు తమకు కావాల్సిన పుస్తకాలను ఆన్‌లైన్‌లో వెతకడానికి అమెజాన్ యూజ్డ్ బుక్ స్టోర్స్, బకెట్ బోల్ట్, యువర్ బుక్ స్టాల్, యో బుక్స్, సెల్ బై బుక్, ఆల్ బుక్స్ ఆన్‌లైన్, బుక్ అడ్డా, మై కాలేజ్ అడ్డా, బుక్స్ నెటవర్క్, స్టూడెంట్ డెస్క్, శ్వాప్ ద బుక్, బుక్ మై బుక్, బుక్ సెల్ బై, కితాబి వంటి వెబ్ సైట్లను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలుగు, ఆంగ్ల దినపత్రికలను తప్పనిసరిగా చదవాలన్నారు. రాష్ట్ర స్థాయి ఛత్రోపాధ్యాయులు పి.అప్పలనాయుడు, ఎ.దుర్గాప్రసాద్, వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆశయం, గమ్యం, లక్ష్య సాధన కోసం కృషి చేస్తే విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో శ్రీగౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, ప్రోగ్రాం కన్వీనర్ మళ్ల బాపునాయుడు, సభ్యులు కర్రి గంగాధర్, బొడ్డేడ జగ్గఅప్పారావు, కాండ్రేగుల అప్పారావు (కెప్టెన్) తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రోడ్లు అధ్వానం

ప్రజాశక్తి-అనకాపల్లి : గత వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని మండలంలోని ఊడేరు మాజీ సర్పంచ్ దండుపాటి గంగరాజు అన్నారు. ఈ మేరకు అనకాపల్లి టు చోడవరం మెయిన్ రోడ్డులోని దర్జీ నగర్ వద్ద ఏర్పడిన భారీ గోతులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కనీసం గోతులు కూడా పూడ్చలేదన్నారు. ఇదే రోడ్లో నాటి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ నిత్యం ప్రయాణించినా దీని గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. ఇందుకు భారీ మూల్యం వారు చెల్లించుకున్నారని, ప్రజలు వారికి బుద్ధి చెప్పి ఇంట్లో కూర్చోబెట్టారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో రహదారులు మెరుగుపడతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా నాగభూషణం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం జన్మదినవేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ గొల్లవీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, రబ్బర్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పట్నాల కృష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు, కొత్తూర్తి రామారావు, పాఠశాల హెచ్‌ఎం కె.సింహేశ్వరి, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి రోటరీ బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన రక్తదాన శిబిరం కార్యక్రమంలో విశాఖపట్నం రోటరీ బ్లడ్ బ్యాంకు వారు వచ్చి డోనర్స్ దగ్గర నుంచి బ్లడ్ సేకరించారు. అసిస్టెంట్ గవర్నర్ మురళీకృష్ణ, ప్రెసిడెంట్ రాజేష్ కుమార్ సెక్రెటరీ అనిల్, కోశాధికారి సత్యంద్, డిస్ట్రిక్ట్ గవర్నర్ విజయనగరం డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతో 2425 యూనిట్లు సేకరించేందుకు లక్ష్యంగా చేసుకున్నట్టు తెలిపారు.

1న జీతాలు చెల్లించడం పట్ల హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి

అంగన్వాడీ ఉద్యోగులకు ఎప్పుడూ లేని విధంగా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించడం పట్ల ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు సోమవారం ఒక ప్రకటనలో హర్షం తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇలానే 1వ తేదీకి వేతనాలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వేతనాలు పెంపు, గ్రాట్యూటీ అమలు, మినీ వర్కర్‌ను మెయిన్ వర్కర్లుగా గుర్తించి వారికి మెయిన్ వర్కర్‌కి ఇచ్చే వేతనం ఇవ్వాలని కోరారు. తదుపరి డిమాండ్స్ పరిష్కారానికి ఆలోచన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి-పరవాడ

జాతీయ వైద్యుల దినోత్సవం స్థానిక ఎన్‌టిపిసి సింహాద్రిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిజిఎం సింహాద్రి హెచ్‌ఓ హెచ్‌ఆర్ సంజయ్ కుమార్ సిన్హా, సీఎంఒ భక్త బత్సల పాత్ర, డాక్టర్ కె విజయ, జీవన్ రేఖ తదితరులు బిసి.రాయ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వైద్యుల సేవలను కొనియాడారు.

హెచ్‌సిజి కేన్సర్ సెంటర్‌లో...

ఎంవిపి కాలనీ : జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌సిజి కేన్సర్ సెంటర్ తమ వైద్యుల కోసం కర్కే బటావో డాక్టర్ సాహెబ్ అనే వినూత్న ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. కార్యక్రమంలో భాగంగా హెచ్‌సిజి సెంటర్‌లో విట్నెస్ చాలెంజ్‌ను నిర్వహించింది. ఈ ఏడాది డాక్టర్స్ డే థీమ్‌గా 'వింగ్స్ అండ్ స్టెతస్కోప్స్: హీలర్స్ ఆఫ్ హోప్'ను ఎంచుకున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలోని హెచ్‌సిజి కేన్సర్ సెంటర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఆదిత్య కౌరా మాట్లాడుతూ, అధునాతన కేన్సర్ చికిత్సను అందుబాటులోకి తీసుకురావడానికి హెచ్‌సిజి వైద్యులు మూలస్తంభంగా నిలుస్తున్నారన్నారు. వీరోచిత సేవలు అందించిన వైద్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా వైద్యులకు సత్కారం

విశాఖ కలెక్టరేట్ : జాతీయ వైద్యులు దినోత్సవం సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రేప్ యూనియన్ ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సోమవారం నలుగురు ప్రజా వైద్యులు డాక్టర్ పి.రామారావు, డాక్టర్ వైఎల్ నర్సింగరావు, డాక్టర్ డి.రాధాకృష్ణన్, డాక్టర్ ఎం.ప్రేమ్ జీతరేలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. కామేశ్వరరావు, డాక్టర్ ఎన్ఎన్.రావు, మెడికల్ రిప్స్ రాష్ట్ర కార్యదర్శి కెవిపి చంద్రమౌళి పాల్గొన్నారు.



బిసి రాయ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎన్‌టిపిసి అధికారులు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



అచ్యుతాపురంలో నినాదాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్ రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అచ్చుతాపురం, కొండకర్ల, దోసూరు గ్రామాలలో సోమవారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల నుండి రూ.1100 కోట్లు వసూలు చేశారని గుర్తు చేశారని, ఆ నిధులను కార్మికుల సంక్షేమానికి కేటాయించలేదని తెలిపారు. కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు, వివాహాలు, గర్భిణీ స్త్రీలకు, కార్మికులకు ప్రమాదాలు జరిగి చనిపోయిన సమయంలో సంక్షేమ బోర్డులో నిధులు మంజూరు చేయాల్సి ఉండగా, ప్రభుత్వం ఆ నిధులను దారిమళ్లించడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె సోము నాయుడు, మణికంఠ భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షులు రాజాన అప్పలనాయుడు, గాలి పైడ్రాజు, బి హరి, జి వసంత అప్పారావు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుల సంఘం సమావేశం సోమవారం అనకాపల్లి సత్యనారాయణ గుడి వద్ద ప్రెసిడెంట్ రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా బిల్డింగ్ వర్కర్స్ బోర్డు నిరుపయోగంగా చేశారని, ఇసుక కొరతతో ఇళ్ల నిర్మాణం జరగక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ మేనిఫెస్టో లో భవన నిర్మాణ బోర్డును పునరుద్ధరిస్తామని ప్రకటించారని, తక్షణమే బోర్డు పునరుద్ధరణ చేయాలని కోరారు. సమావేశంలో నాగు, 24 మండలాల నుండి కార్మికులు పాల్గొన్నారు.

అనకాపల్లి : గత వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు వై.ఎన్. భద్రం కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం మామిడి పాలెం లో సోమవారం జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో యూనియన్ నాయకులు గోపాలం మహాలక్ష్మి, ఎం కాశీ అప్పారావు, అప్పలకొండ, వెంకట్రావు, సత్తిబాబు, చెల్లూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాల సంఘం అధ్యక్షునిగా అప్పలనాయుడు ఎన్నిక



ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలో కింతాడ పంచాయతీ శివారు జోగన్నపాలెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షునిగా ప్రస్తుత అధ్యక్షుడు బండారు అప్పలనాయుడు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో డైరెక్టర్లు కూండ్రపు నరసింహమూర్తి, కుబిరెడ్డి అర్జున, చింతు అన్నంనాయుడు, కుబిరెడ్డి ఈశ్వరమ్మ, బండారు రమణమ్మ, రెడ్డి నరసయ్య, బండారు స్వామినాయుడు, బండారు రమణ, బండారు దేముళ్ళు పాల్గొని అప్పలనాయుడును అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. అప్పలనాయుడు మరో ఐదేళ్ల పాటు అధ్యక్షుడుగా కొనసాగుతారు. రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన అప్పలనాయుడుచే సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు ప్రమాణం స్వీకారం చేయించారు. సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, సొసైటీ వేతన కార్యదర్శి బండారు గంగునాయుడు, పూర్వ అధ్యక్షుడు పోలిబాబు, పూర్వ వేతన కార్యదర్శి కుబిరెడ్డి మల్లునాయుడు, గ్రామ పెద్దలు కన్నూరు అప్పలనాయుడు తదితరులు అప్పలనాయుడుకు అభినందనలు తెలిపారు.



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

కెజిబివిలో అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులను సోమవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకోమా టైర్ల కంపెనీ సిఎస్ఆర్ నిధులతో భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్ఇజెడ్‌లోని పరిశ్రమల ప్రతినిధులు ఎలమంచిలి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ ఉమాదేవి, ఎకోమా సంస్థ ప్రతినిధులు, జనసేన నాయకులు జనపరెడ్డి నర్సింగరావు, ఈగల అప్పలనాయుడు, కునిశెట్టి రమణ, బి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

'టీచ్ టూల్' శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -చోడవరం

చోడవరం, చీడికాడ, బుచ్చయ్యపేట, సబ్బవరం, కె.కోటపాడు, పరవాడ, రావికమతం, దేవరాపల్లి, మండలాల ఉపాధ్యాయులకు చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 'టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం కోర్సు డైరెక్టర్ ఐవి.రామిరెడ్డి సోమవారం ప్రారంభించారు. దీనిని సందర్శించిన సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి మురళీమోహన్ మాట్లాడుతూ బోధన నాణ్యతను మెరుగుపరిచేందుకు, తగిన విధంగా వృత్తిపరమైన అభివృద్ధిని అందించడానికి ఈ శిక్షణా కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దీనికి మాస్టర్ ట్రైనీలుగా జగన్నాధరావు, భాస్కర్, సముద్రం, బొంజుబాబు, కుమార్ సతీష్ వ్యవహరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు జయలక్ష్మి, సింహాచలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామిరెడ్డి

స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకుండా

పింఛన్లు పంపిణీ చేయడంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక నాయకులతో కలిపి పంపిణీ చేయాల్సి ఉండగా, స్థానిక నాయకులకు సంబంధం లేకుండా పంఛన్లు పంపిణీ చేసిన మండలంలోని దిబ్బిడి సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ శకుంతలపై గ్రామ నాయకులు సోమవారం ఎంపీడీవో వెంకటాచార్యులుకు ఫిర్యాదు చేశారు. ఉదయం 6 గంటలకు సచివాలయం వద్ద పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి అనంతరం క్లస్టర్ల వారీగా పంపిణీ చేయడానికి స్థానిక నాయకులకు తెలియజేయకుండా పంపిణీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపిడిఒకు ఫిర్యాదు చేసినవారిలో మాజీ ఎంపీటీసీ గొన్నాబత్తుల శ్రీనివాసరావు, స్థానిక నాయకులు సేనాపతి శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు సేనాపతి మణికంఠ, చిన్ని లక్ష్మణ, వట్టికోళ్ల కృష్ణ, ముమ్మిన సంతోష్ తదితరులు ఉన్నారు.

పిజిఆర్ఎస్‌లో పలు సమస్యలపై అర్జీలు

ప్రజాశక్తి -అనకాపల్లి

నూతన ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి సూచించారు. కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావుతో కలిసి అర్జీలు స్వీకరించారు. ప్రజలు పలు సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్మికులు కనీస వేతనం అమలు చేయాలని

ప్రభుత్వ వైద్య కళాశాలలు, భోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో పారిశుధ్యం, భద్రతా, చెద పురుగుల నివారణ నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజ్యలక్ష్మి, వర ప్రసాద్, సంతోష్, కిరణ్ పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న ఎస్‌పి మురళీకృష్ణ

జిల్లా పోలీసు కార్యాలయంలో 22 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర 22 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై సావిత్రి పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎలమంచిలి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై దృష్టి సారించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. అచ్యుతాపురం ఎస్‌టిబిఎల్‌లోని తన స్వగృహంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గస్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేను అధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివద్ధి చేయడానికి సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

ప్రజాశక్తి-పరవాడ : మండల కేంద్రం పరవాడ బీసీ కాలనీలో నివాసముంటున్న రాయపురెడ్డి హేమలత రాజులనాయుడు (55) ఇంటిలోకి ఆదివారం ఉదయం 10.30 గంటలకు ప్రవేశించి దాడి చేసిన పరవాడ గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్, అతని అక్కపై కేసు నమోదు చేసినట్లు పరవాడ సిఐ బాల సూర్యారావు తెలిపారు. షేక్ ఇస్మాయిల్ రాయపు రెడ్డి హేమలతను ఆమె ఆమె భర్త రాజుల నాయుడును కొట్టి చంపుతామని కత్తితో బెదిరించాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రాయపరెడ్డి హేమలత తెలిపారు. ఈ మేరకు సిఐ షేక్ ఇస్మాయిల్‌పై 285 2924 ఎఫ్ఐఆర్‌తో ఐపీసీ 448, 323, 354, 506, ఆర్/ డబ్ల్యూ 34 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.



కెజిహెచ్‌లో పింఛను అందజేస్తున్న వెంకటరమణ

కెజిహెచ్‌కి వెళ్లి పింఛను పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ మండలం రావాడ పంచాయతీ పరిధిలోని సచివాలయ సిబ్బంది కె.వెంకటరమణ సోమవారం విశాఖ కెజిహెచ్‌కి వెళ్లి సామాజిక పింఛను లబ్ధిదారునికి పింఛన్ అందజేశారు. పరవాడ మండలం రావాడ పంచాయతీకి చెందిన బి.సరోజిని అనారోగ్యం కారణంగా కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో బి.సరోజినికి ప్రతి నెలా ఇవ్వాల్సిన డయాలిసిస్ పింఛన్‌ను సచివాలయ సిబ్బంది కె.వెంకటరమణ పరవాడ నుంచి విశాఖ కెజిహెచ్‌కు వెళ్లి ఆమెకు అందజేశారు. దీనిపై వెంకటరమణను పలువురు అభినందించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పాడేరు రోడ్డు ప్రమాదంలో ఇటీవల చనిపోయిన పంచదారుల లక్ష్మణ్ కుటుంబానికి సోమవారం ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు తన సొంత నిధులు రూ.25 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. లక్ష్మణ్, తల్లి భార్యను పరామర్శించి ఓదార్చారు. లక్ష్మణ్ మృతి కుటుంబానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు.

నేడు రాంకీ గేట్ వద్ద మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఫార్మసిటీలోని ఫార్మా కంపెనీలు వ్యర్థ జనాలు సముద్రంలోకి వదలడం వల్ల ముత్యాలమ్మ పాలెం ఉప్పుటేరులోనూ, సముద్రంలోనూ మత్స్య సంపద భారీ ఎత్తున మృత్యవాత పడతున్న నేపథ్యంలో మత్స్యకారులు మంగళవారం రాంకీ గేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, ఎంపీటీసీ అరిజిల్లి దేవి, రవి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఫార్మాసిటీ రాంకీ గేటు వద్ద జరుగు ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం పంచాయతీల మత్స్యకారులు పాల్గొంటారు.

ఘనంగా పంచకర్ల ప్రసాద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పరవాడ : జనసేన పార్టీ పరవాడ మండలం ఇన్‌ఛార్జి పంచకర్ల ప్రసాద్ జన్మదిన వేడుకలు సోమవారం పరవాడ మరిడిమాంబ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. జనసేన ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయితీ నాయకుడు అర్జిల్లి అప్పలరాజు, ఎన్‌డిఏ కూటమి నాయకులు వాసుపల్లి సోము శేఖర్, సిహెచ్.ముత్యాలు, మూస రామకృష్ణ, నాగరాజు తదితరులు ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు.

వాడవాడలా పింఛన్ల పంపిణీ



భీమిలిలో పింఛను ఇస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి - యంత్రాంగం

పెంచిన పింఛన్లను విశాఖ, అనకాపల్లిలో జిల్లాల్లో సోమవారం పంపిణీ చేశారు. ఈ పింఛన్లను సచివాలయాల సిబ్బంది అందజేశారు.

విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజవర్గ పరిధిలోనిఅన్ని వార్డులలో ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని పింఛన్లు పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల వద్దకే పాలన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమాల్లో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, జోనల్ కమిషనర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా విశాఖ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ 29వ వార్డులోని దండుబజార్‌వీధిలో పింఛన్లు అందజేశారు. ఆయనతో పాటు డిఆర్‌డిఎ పీడీ శోభారాణి, జోనల్ కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఒకటవ తేదీనే శత శాతం పూర్తిచేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జివిఎంసి జోన్ 3, 4లలో పింఛన్ల పంపిణీని ఆయా జోనల్ కమిషనర్లతో కలిసి పర్యవేక్షించారు. యుసిడి ఎపిడిలు దుర్గాప్రసాద్, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి 1,2,3 వార్డులతోపాటు మండలంలోని మజ్జివలస గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు.కార్యక్రమాల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, జెడ్‌పిటిసిగాడు వెంకటప్పుడు, పార్టీ నాయకులు గాడు తాతినాయుడు, నీలాపు సూర్య నారాయణ, సర్పంచ్ జివి నారాయణ, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ పాల్గొన్నారు

పద్మనాభం: పద్మనాభం బిసి కాలనీలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కె.రమణ,కె..లీలా్ కే దామోదరరావు, కె.నగేష్ కుమార్ పాల్గొన్నారు

మధురవాడ: జవిఎంసి 5,7 వార్డుల్లో పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారభించారు. ఇంటింటికీ వెళ్లి పింఛను అందజేశారు.కార్యక్రమంలో జనసేనభీమిలి ఇంచార్జ్ సందీప్ పంచకర్ల, కోరాడ రాజబాబు, కార్పొరేటర్లు పిల్లా మంగమ్మ, మొల్లి హేమలత పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తి పురుషోత్తపురం చినముసిడివాడ, పురుషోత్తపురం, వేపగుంట, నాయుడు తోట, సరిపల్లి ప్రాంతాల్లో లబ్ధిదారులకు కూటమి నేతలు పింఛన్లు పంపిణీ చేశారు. సరిపల్లిలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు

గోపాలపట్నం: విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు, కూటమి శ్రేణులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ములగాడ: పారిశ్రామిక ప్రాంతంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని పర్యవేక్షించారు

సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలో ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకమార్‌రాజు ఇంటింటికీ వెళ్లి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు.జెడ్‌సి ఆర్‌జివి.కృష్ణ, జనసేన ఇన్‌ఛార్జి ఉషాకిరణ్ పాల్గొన్నారు. 26వ వార్డులో స్థానిక టిడిపి కార్పొరేటర్ ముక్కా శ్రావణి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

వేపగుంట: 94వ వార్డు కృష్ణానగర్‌లో లబ్ధిదారులకు జనసేన నాయకులు ఎర్రనాగరాజు, గొంతు ప్రకాష్, సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ పట్నా లావణ్య పింఛన్లు పంపిణీ చేశారు.

ఆరిలోవ : వికలాంగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం తోటగరువు, వెర్నిమాంబ గుడి ఆవరణలో ఎన్టీఆర్, చంద్రబాబు చిత్రపటాలకు వికలాంగులు పాలాభిషేకం చేశారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు పాల్గొన్నారు.

పిఎం పాలెం: జివిఎంసి ఆరోవార్డులో లబ్ధిదారులకు సచివాలయ సిబ్బందితో కలసి కూటమి నేతలు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్, పాల్గొన్నారు .

మాధవధార : 51వ వార్డులో టిడిపి అధ్యక్షులు సనపల కీర్తి, జనసేన అధ్యక్షులు గుడివాడ అప్పారావు, బిజెపి అధ్యక్షులు తమ్మినేని లోహితరావు, ఇతర కూటమి నేతలు సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

ఆనందపురం : మండలంలో 8,821మంది లబ్ధిదారులకు గాను 95.18శాతం మందికి సోమవారం ఒక్కరోజులోనే పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒఅప్పలనాయుడు తెలిపారు. శిర్లపాలెంలో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.శొంట్యాంలో జనసేన మండల కార్యదర్శి కోరుకొండ మూర్తి, బోద్ధపు గోవింద, బోనిలో సర్పంచ్ బోని అప్పలకొండ సన్యాసి నాయుడు, మామిడిలోవలో సర్పంచ్ బల్‌రెడ్డి మల్లికార్జునరావు, లోడగలవానిపాలెంలో సర్పంచ్ లోడగల రాజేశ్వరి, వెంకటాపురంలో జనసేన నాయకులు తాడవాడ శివకృష్ణ, ప్రశాంత్ కుమార్, వేములవలసలోఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, గ్రామ కార్యదర్శి నర్సింగరావు, ఆనందపురంలో సర్పంచ్ చందక లక్ష్మి, చందక సూరిబాబుపాల్గొన్నారు.



మాడుగులలో...

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాలలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి బాబి, ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు. అనకాపల్లి విజయరామరాజుపేట, నెయ్యల వీధి ప్రాంతాల్లో లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ పంపిణీ చేశారు.

కశింకోట : కశింకోట మండలం తాళ్ళపాలెం గ్రామంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, కూటిమి నాయకులు గొంతిని శ్రీనివాసరావు, కాయల మురళి, ఉల్లింగల రమేష్ వేగి గోపికృష్ణ, సిడిరెడ్డి శ్రీను, పెంటకోట రాము, పావాడ కామరాజు పాల్గొన్నారు.

సబ్బవరం : సబ్బవరంలో అంబేద్కర్ విగ్రహానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాలాభిషేకం చేసి పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీ లక్ష్మీరాణి, కూటమి నేతలు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, పీబీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని గొట్లం గ్రామంలో పింఛన్లను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, ఎంపీడీవో పట్నాయక్, టిడిపి నాయకులు సబ్బవరపు రాము నాయుడు పాల్గొన్నారు.

మునగపాక : మునగపాకలోని లబ్ధిదారులకు పింఛన్లను జనసేన, టిడిపి నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాడి ముసలి నాయుడు, కర్రి సాయి కృష్ణ పాల్గొన్నారు.

పరవాడ : పరవాడలో సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, చంద్రబాబు పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. తాణాంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి మాజీ, ఎంపీపీ పైలు జగన్నాథరావు పంపిణీ చేశారు.

అచ్యుతాపురం : మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, కూటమి నాయకులు రాజాన రమేష్ కుమార్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లిలో మాజీ ఎంపీపీలు కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు, మాజీ జెడ్పిటిసి పోతల పాత్రునాయుడు, టిడిపి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరఖాన సూర్యనారాయణ, చల్లా నానాజీ పంఛన్లు పంపిణీ చేశారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం కోమల్లపూడి, ఎల్‌బిపి అగ్రహారం, బంగారు మెట్ట గ్రామాల్లో కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. గేదెల సత్యనారాయణ, తమరణ దాసు, పాల్గొన్నారు.

మోరాయించిన సర్వర్లు

దేవరాపల్లి : దేవరాపల్లి మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సర్వర్లు పని మోరాయించాయి. దీంతో పింఛన్ల పంపిణీకి అంతరాయం ఏర్పడడంతో లబ్ధిదారులు నిరీక్షించాల్సి వచ్చింది. సర్వర్లు మోరాయించడంతో మండలం మొత్తం 75 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది.

మాడుగుల: మాడుగులలో పింఛన్లను పంపిణీ చేశారు.స్థానిక బస్టాండ్ ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, టౌన్ ప్రెసిడెంట్ రంజిత్ వర్మలు పాలాభిషేకం చేశారు. మాడుగుల పట్టణంలో 95 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు సెక్రెటరీ సిహెచ్ నాయుడు తెలిపారు.



నర్సీపట్నంలో సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు

నాతవరం :నాతవరంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూనిశెట్టి జోగిరాజు, గంటా శ్రీనివాసరావు, శివలంక మరినేశ్వరరావు, తానారి శ్రీను, రేగటి మంగ, అల్లాడి నాగరాజు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు సర్వర్లు మొరాయించడంతో పింఛన్లు పంపిణీలో జాప్యం ఏర్పడింది.ఈ కార్యక్రమంలో తెదేపా పార్టీ సీనియర్ నాయకులు సర్పంచులు, మాజీ సర్పంచ్లు, జనసేన, బిజెపి నాయకులుపాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ :అయ్యన్నపాలెంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, ఆంద్రప్రదేశ్ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా లబ్ధిదారులకు 7000 పెన్షన్ అందించడం ఇదే తొలిసారన్నారు.అనంతరం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జానకి శ్రీను పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోటవురట్ల ఎంపీటీసీ సభ్యులు పి సూర్యారావు, సుంకర బాబ్జి, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు దాసరి భాస్కరరావు, జనసేన పార్టీ నాయకులు శివప్రసాద్ పాల్గొన్నారు.

నక్కపల్లి:ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్ల పథకం అమల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. సర్వర్ మొరాయించడంతో రెండు గంటలు ఇబ్బందులు పడ్డారు. ఉపమాకలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, టిడిపి యువ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు .

నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీ పరిధిలో 28 వార్డుల్లో 85 శాతం పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని మున్సిపాలిటీ కమిషనర్ రవిబాబు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మున్సిపాలిటీలో పనిచేస్తున్న 214 మంది సిబ్బందితో పెన్షన్ పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి మంగళవారం ఉదయం సిబ్బంది ప్రతీ ఇంటికీ వెళ్లి ఇవ్వడం జరుగుతుందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

ఒకే చోట పింఛన్లు పంపిణీ

చీడికాడ :రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి ఒక్కరికి ఇంటింటికి వెళ్లి పింఛన్ అందజేయాలని ఆదేశాలు జారీ చేసినా మండలంలోని పలు గ్రామాల్లో అమలు కాలేదు. పలు చోట్ల పింఛన్ పంపిణీ దారుల ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయలేదు. ఒకచోట కూర్చొని పింఛన్‌దారులను రప్పించి పంపిణీ చేశారు. మండలంలోని అర్జునగిరిలో వృద్ధులు, వితంతువులను ఒక చోటకి రప్పించి పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో, పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒకచోట కూర్చుని పంపిణీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

అయ్యన్న గెలుపుతో..

కాలినడకన తలుపులమ్మలోవకు

ప్రజాశక్తి గొలుగొండ: నర్సీపట్నం నియోజకవర్గం లో కూటమి అభ్యర్థి అయ్యన్న గెలుపుతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పుణ్యక్షేత్రాలకు వెళ్తున్నారు. గొలుగొండ మండలానికి చెందిన పైల ప్రసాద్, బద్రి తదితర కార్యకర్తల, అయ్యన్న గెలిస్తే తునికి సమీపంలో ఉన్న తలుపులమ్మలోవకు కాలినడకన వస్తామని నాయకులు మొక్కుకున్నారు. దీనిలో భాగంగా సోమవారం వారంతా ఉదయం 10 గంటలకు కాలి నడకన తలుపులమ్మలోవకు బయలుదేరారు. మంగళవారం ఉదయం కి తలుపులమ్మ లోవకి చేరుకుంటామని వారు తెలిపారు.



లోవకు వెళుతున్న నాయకులు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- చీడికాడ: మండల కేంద్రంలో ప్రధాన రహదారి ఆక్రమణలకు గురైనా అధికారుల స్పందించ లేదని ఆటో యూనియన్ సభ్యులు పోతల అర్జున, టాక్టర్ యూనియన్ అధ్యక్షులు, పంచాయితీ మాజీ వార్డు సభ్యులు కొంచా అచ్చిబాబు, బిజెపి జిల్లా నేత రెడ్డి కొండబాబు అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, మండల కేంద్రం నుండి చోడవరంకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమించారని, సిరిజం రహదారి సైతం ఆక్రమణకు గురైందన్నారు. రోడ్డు విస్తరణ జరగకపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందన్నారు. దీనిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ చేయకపోతే రానున్న రోజుల్లో ఈ రోడ్డుపై ప్రయాణం చేయడం చాలా కష్టమన్నారు.

కూటమి హామీలను అమలు చేయాలి

-మాజీ ఎమ్మెల్యే గణేష్



ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం ప్రతి పెన్షన్ లబ్ధిదారులకు నాలుగు వేలు ఇవ్వడం ఆనందించ దగ్గ విషయమని, తక్షణమే అన్న క్యాంటీన్లను ప్రారంభించామని మాజీ ఎమ్మెల్యే గణేష్ కోరారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం అన్నా క్యాంటీన్ ప్రారంభించి ఐదు సంవత్సరాలు కొనసాగించాలన్నారు. గతంలో ప్రభుత్వం ఏర్పడి ఎన్నికలకు ఆరు నెలలు ముందుగా అన్న క్యాంటీన్ ప్రారంభించడం జరిగిందని తెలిపారు.ఇలా కాకుండా ఐదు సంవత్సరాలు అన్న క్యాంటీన్ కొనసాగించాలన్నారు. తల్లికి వందనం ద్వారా విద్యార్థులకు రూ.15 వేలు జమ చేయాలన్నారు. నిరుద్యోగ భృతి కోసం నియోజకవర్గంలో 42,000 మంది ఎదురుచూస్తున్నారన్నారు. లక్ష మందికి పైగా మహిళలు ఉచిత గ్యాస్ ఉచిత బస్సు, నెలకు రూ.1500 కోసం ఎదురు చూస్తున్నారని, వీరందరికీ త్వరలో కూటమి ప్రభుత్వం పథకాలు ఇవ్వాలన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న హోం మంత్రి అనిత

టిడిపి నేత వెంకటేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -నక్కపల్లి:తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. నక్కపల్లిలో ఆయన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో హెూం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ముందుగా వెంకటేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అనితకు ఘన స్వాగతం పలికారు. వెంకటేష్‌ను ఆమె శాలువాతో సత్కరించి, బహుమతిగా మొక్కను అందజేసి ,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తరలివచ్చి వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

స్థల వివాదంపై ఘర్షణ

ప్రజాశక్తి–కోటవురట్ల: మండల కేంద్రంలో మర్రిచెట్టు సెంటర్ వద్ద స్థల వివాదంపై ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులకు ఇరువురు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మర్రిచెట్టు సెంటర్ వద్ద ఆర్అండ్‌బి స్థలంలో మాడెం లక్ష్మి ఇంటి సమీపంలో గత 30 సంవత్సరాలుగా టీ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తుంది. సార్వత్రిక ఎన్నికల ముందు ఇది ఆక్రమణ స్థలం అంటూ అధికారులు టీ దుకాణాన్ని కూల్చివేశారు. ఆ క్రమంలో కూల్చిన దుకాణం ఎదురుగా ఆమె నిరసన చేపట్టింది. అధికారులు, నాయకులు ఎన్నికల అనంతరం తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల కాలంలో నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడంతో ఎదురుగా టీ దుకాణం పెట్టేందుకు మాడెం లక్ష్మిను పలువురు నిరాకరించడంతో ఇరువురి మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీనిపై పోలీసులకు ఇరువురు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు స్థానిక ఎస్సై రమణయ్య తెలిపారు.



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

4న రాష్ట్రవ్యాప్త

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి–అనకాపల్లి

నీట్ పరీక్షల అవకతవకలపై ఈ నెల 4న చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త బందును విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్ఓ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ, పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. బాబ్జి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్టిఏ నిర్వహించిన నీట్ ఎగ్జామ్‌లో స్కాం జరిగిందని తెలిపారు. తక్షణమే ఎన్‌టిఏని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు బి.రాజేష్, ఎం.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 4న జరగనున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని స్థానిక ప్రభుత్వ బిసి కళాశాల వసతి గృహంలో సోమవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రచారం చేశారు. 4న కేజీ నుండి పిజీ వరకు విద్యాసంస్థలన్నీ దేశవ్యాప్త బంద్ పాటించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు సింహాద్రి, చరణ్, జగదీష్, తాతాజీ, చిన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:ఈనెల 4న బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నేతలు కోరారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద గాంధీజీ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఇతర సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ గీతాకృష్ణ మాట్లాడుతూ, నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు కేంద్రం నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో విద్యార్థులు ఎంతో నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర, ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్, ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు భూషణ్, జ్ఞానేశ్, కిరణ్, లోవ కుమార్, శ్రీను, కిషోర్ తదితరులు పాల్గొన్నారు .

విశాఖ కలెక్టరేట్ : నీట్, యుజిసి నెట్ పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అసమర్థ ఎన్‌టిఎను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4వ తేదీన దేశ వ్యాప్తంగా చేపట్టే కేజీ టు పీజీ విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్ఒ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో విద్యా సంస్థల బంద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్, ఎఐఎస్ఎఫ్ అధ్యక్షుడు జాన్సన్ బాబు మాట్లాడుతూ, నీట్, నెట్ పరీక్ష పేపర్ల లీకేజీలు వల్ల లక్షలాది మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. నీట్, యుజీ, పీజీ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం విద్యా రంగాన్ని తీవ్ర నష్టం చేసిందన్నారు. పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీల వరకు విద్య మొత్తాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పెడుతున్న నేపథ్యంలో చేపట్టే దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె నాయుడు, ఎఐఎస్ఎఫ్ కార్యదర్శి యు.నాగ, పిడిఎస్ఒ అధ్యక్షుడు విశ్వనాథం, విద్యార్థి సంఘాల నాయకులు పి.రాము, శ్రీను, పి.సాయితేజ, అఖిల్ పాల్గొన్నారు.



విశాఖలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్ఒ నాయకులు



నర్సీపట్నంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

వైజాగ్ వారియర్స్, ఉత్తరాంధ్ర లయన్స్ విజయం

ప్రజాశక్తి- పిఎం పాలెం (విశాఖపట్నం): వైజాగ్ వేదికగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఏపీఎల్ సీజన్ –3 సోమవారం ఉదయం పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం వేదికగా రెండో మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్, బెజవాడ టైగర్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో వైజాగ్ వారియర్స్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన వైజాగ్ వారియర్స్ బౌలింగ్ ఎంచుకొని బరిలోకి దిగింది. బ్యాటింగ్ బరిలోకి దిగిన బెజవాడ టైగర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 143 పరుగులు చేసింది. ఓపెనర్లు ఎం.అభినవ్, మహీప్‌కుమార్ తర్వాత వచ్చిన ధ్రువుకుమార్‌రెడ్డి, కెప్టెన్ రిక్కిబుయి అంతగా రాణించలేకపోయారు. మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన మనీష్ గొలమారు 37 బంతుల్లో 44 పరుగులు చేశాడు.

తర్వాత బ్యాటింగ్ బరిలోకి దిగిన వైజాగ్ వారియర్స్ 19.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్లు బండారు సుజాన్, అశ్విన్ హెబ్బర్ పార్టనర్‌షిప్‌లో 62 పరుగులు చేసి అవుటయ్యారు. తర్వాత దిగిన కెప్టెన్ కె.శ్రీకర్ భరత్ మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 23 బంతుల్లో 46 పరుగులు చేసి నాట్ అవుట్‌గా నిలిచాడు. మిడిల్ ఆర్డర్లో దిగిన మువ్వల యువన్ 20 పరుగులు చేసి చివరి వరకు బరిలో నిలిచి విజయం అందించారు.



అవుట్ చేసేందుకు ప్రయత్నిస్తున్న క్రీడాకారుడు

ఉత్తరాంధ్ర లయన్స్ విజయం

సోమవారం సాయంత్రం కోస్టల్ రైడర్స్, ఉత్తరాంధ్ర లయన్స్ టీమ్‌లు తలపడ్డాయి. 9 వికెట్ల తేడాతో ఉత్తరాంధ్ర లయన్స్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన ఉత్తరాంధ్ర లయన్స్ బౌలింగ్ ఎంచుకొని బరిలోకి దిగింది. బ్యాటింగ్ బరిలోకి దిగిన కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 131 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు.

బ్యాటింగ్ బరిలోకి దిగిన ఉత్తరాంధ్ర లయన్స్ కేవలం 8.3 ఓవర్లలలోనే 1 వికెట్ నష్టానికి 132 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్ బ్యాట్స్‌మెన్ సనబోయిన తరుణ్ 24 బంతుల్లో ఐదు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో అర్ధ సెంచరి చేసి నాట్ అవుట్‌గా బరిలో నిలిచాడు.

రక్షణ కల్పించాలి

మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి



ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :ఒంటరి మహిళనైన తనకు రక్షణ కల్పించాలని స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం జరిగిన ఫించను పంపిణీలో సామాన్యురాలిలా తనకు పింఛను ఇచ్చారని, ఇది ఎంతో బాధకలిగించిందన్నారు. నా మీద ఎవరైనా దాడికి ప్రయత్నించే అవకాశం ఉందని, అందుకే పోలీసులను ఆశ్రయిస్తానన్నారు. తాను ఎప్పుడు అయ్యన్న కుటుంబాన్ని దూషించలేదని తెలిపారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు–2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ–మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ